# ఛిన్నమస్త

"వాసిష్ఠ"

అది పడైవీడు క్షేత్రం

రేణుకాలయం కొండల మధ్యనున్న విశాలమైన మైదానమందు నిర్మింపబడి ఉంది. దానికి కొంతదూరంలో కమండలు నది ప్రవహిస్తూంది.

ఆలయాంతర్భాగంలోని ఒక మంటపంపై ఇద్దరు వ్యక్తులు కూర్చొని ఉన్నారు. వారిలో ఒకడు వయస్సు చెల్లినవాడు. పేరు రామానంద యోగి. రెండవవాడు యువకుడు. పేరు ధనంజయశర్మ.

"ఈ ప్రశాంతమైన స్థలంలో కొన్ని రోజులుండి యోగసాధన చేసుకోవాలని తీర్మానించాను." అన్నాడు సగం నెరసిన గడ్డాన్ని సర్దుకుంటూ రామానందయోగి.

"గురుదేవా! నాకూ అలాంటి ఉద్దేశమే కలిగింది. ఇదివరలో అనేక క్షేత్రాల్ని చూచాం కాని, ఎక్కడకూడ శిరస్సు మాత్రమే మూల విగ్రహంగా కల క్షేత్రాన్ని చూడలేదు: దీని అంతర్యమేమో గురుపాదులు సెలవియ్యాలని ప్రార్థిస్తున్నాను" అని అన్నాడు ధనంజయ శర్మ.

"శర్మా! స్మరణమాత్రం చేతనే సమస్త పాపాలు పటాపంచలయ్యే ఛిన్నమస్త యొక్క చరిత్రను చెప్తాను. సావధానంగా విను. ఇక్కడికి క్రోసుదూరంలో పడైవీడు అనే గ్రామం ఉంది. అదీ పూర్వం కుండిన పురి. దానికి నందనగరమని పేరుకూడ ఉంది. పడైవీడు అంటే అరవభాషలో సైనికుల విడిది అని అర్థం. దానికి తగిన గుర్తులు నీకు ఈ ప్రాంతంలో కొల్లలుగా కన్పిస్తాయి.

"వేదకాలంలో ఈ సహ్యాద్రి ప్రాంతం జమదగ్ని మహర్షియొక్క గురుకులంగా ఉండేది. ఆ శిఖరాన్ని గమనించు: దాన్నే చంద్రగిరి అని అంటారు అక్కడే జమదగ్నియొక్క ఆశ్రమం ఉండేదట: ఇక్కడ ప్రవహిస్తున్న నది జమదగ్ని మహర్షియొక్క కమండలు ధార అని ప్రసిద్ధి: నది ఒడ్డున జమదగ్నియొక్క యజ్ఞవాటిక ఉండింది. ఈ నాటికిని ఆ ప్రాంతంలో ఎక్కడ త్రవ్వినా విభూతి మట్టి దొరుకుతుంది: జమదగ్నియొక్క పత్ని పేరు రేణుక: ఆమె చరిత్ర పావనతమం: తలుస్తేనే శరీరం గగుర్పాటు చెందుతుంది:

"ఈ సందర్భంలో నీకు కొంత అధ్యాత్మిక విషయాన్ని చెప్పవలసి ఉంది. అది ప్రస్తుతం కూడా. దశ మహా విద్యలనే మాటను నీవు వినే ఉంటావు. పరాశక్తియొక్క దశ విధములైన శక్త్యూర్ములనే దశమహా విద్య ఉంటారు! ఇవి బ్రహ్మాండంలోను, అది పిండంలోను సత్యం చెప్తున్న శక్తి విలాసములు: "లలితా" శక్తి సహస్రారగతమైన పరాశక్తి యొక్క కళ: 2)"ఛిన్నమస్త" ఆజ్ఞాచక్రంలో విజృంభిస్తుంది: 3)"కాళి"హృదయ స్థానంలోవుంది ఈహృదయ స్థానాన్ని భద్రకవాటమని వర్ణిస్తారు, తాంత్రికులు: "త్రిపుర భైరవి" మూలాగ్నికుండ గత శక్తి 5)'సుందరి'(భువనేశ్వరి) ప్రజ్ఞాస్థాన కళ: దీన్నే శుద్ధసంవిత్ అని అంటారు యోగులు:

## ప్రచురణకు స్వీకరించిన పోటీ కథ

(6) "జ్యేష్ఠనే" చిచ్ఛక్తిగా వర్ణిస్తారు. దీన్ని ఉపాసించువారికి నిర్వికల్ప సమాధి ఏర్పడుతుంది 7) "తార"నే పశ్యంతీ వాక్కుగా కొంత దర్శనులైన ఋషులు పేర్కొన్నారు: ఈ శక్తి మణిపూర చక్రమందు ఉందంటారు తాంత్రికులు! 8) "మాతంగి"ని వైఖరీ వాక్కుగా కీర్తించారు" ఇది జిహ్వారంగంలో తాండవిస్తుంది. 9) "బగళ" స్తంభన శక్తి అని అంటారు: 10"కమల"నే లక్ష్మీ కళగా వర్ణించారు: ఇవే మహా విద్యలు:

"ఈరేణుకాలయమందు "ఛిన్నమస్త" ప్రతిభాసిస్తుంది: ఈమె ప్రచండచండి:

"ఛిన్నం శిరః కర్త్రికం చ దధానాం
కరేణ కంఠోద్గత రక్తధారాం:
రామాంబికాం దుర్జన కాలరాత్రిం
దేవీం పవిత్రాం మనసా స్మరామి॥

అని వాసిష్ఠ గణపతి మునీంద్రులు ప్రచండ చండి అవతారమగు రేణుకను గానంచేసి ఉన్నారు: ఇక కథను విను.

* * *

ఇది వేదకాలంలోని పవిత్ర చరిత్ర:

కృతుడనే వాడు మరీచి పుత్రుడైన కశ్యప మహర్షి శిష్యుడై, తన బ్రహ్మచర్య వ్రతాన్ని గురుచరణ సన్నిధానంలో గడిపాడు.

పాతికేళ్ళ ప్రాయంలోనే కృతుడు సర్వ శాస్త్రాల్ని అధ్యయనంచేసి బుషితుల్యుడయ్యాడు. కశ్యపుడు శిష్యుని ప్రజ్ఞాసంపత్తికి మెచ్చుకొని-

"కృతా: ఈ గురు కులంలో సంపూర్ణ విద్యా సంపన్నుడయ్యావ్! ఇక యథేచ్ఛగా వెళ్ళి గార్హస్థ్యాన్ని స్వీకరించి లోకకల్యాణమునకై నీ జీవితాన్ని అంకితం చేసుకో!" అని చెప్పాడు.

దైన్యభావంతో ఇంకా తన ఎదుట నిలబడి ఉన్న కృతుని గమనించి కశ్యప మహర్షి మందహాసంతో మరల అన్నాడు.

"నాయనా! నీవేమి చింతిస్తున్నావో గ్రహించాను. నీవు పదిహేను సంవత్సరాలు భక్తితో గురుసేవ చేశావ్: చేసిన సేవయే గురు దక్షిణగా స్వీకరించాను: నీ భావి జీవితం తేజోవంతం చేయాలని భగవాన్ ఇంద్రుని ప్రార్థించి ఆశీర్వదిస్తున్నాను: వెళ్ళిరా!"

శిష్యవత్సలుడైన గురువు వాక్యంవల్ల మనస్సు తేలికపడ, కృతుడు మరీచాశ్రమాన్ని వదలి వెళ్లిపోయాడు!

కృతఋషి దేశాటన కావిస్తూ అనేక గురుకులాల్ని సందర్శించాడు: పుణ్య తీర్థాల్లో స్నానం చేసాడు: తుదకు వింధ్యాద్రి దాటి విదేహ దేశంలో అడుగు పెట్టాడు... శిప్రా (ఇప్పటి పేరు) నదీ ప్రాంతంలోని ప్రకృతి సంపదని చూచి ఆనందించి, కొంత కాలం అక్కడ తపో వృత్తిలో గడుపుదామని తీర్మానించాడు!

కరండి అనే గ్రామం నదీ తీరంలో ఉంది. అక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు కృతఋషి:

కరండి గ్రామంలో ఆర్యులు, అనార్యులు-ఉన్నారు- వారు అన్యోన్యం కలసి మెలసి సోదర భావంతో ఉంటున్నారు: కొన్ని ఆచార నియమాల్లో ఇరువురు భిన్నులైనా దేవతారాధన విషయంలో సమస్థాయిలోనే ఉంటూ ఉండేవారు:

కృతఋషి విజ్ఞానవృద్ధిని గమనించి బుద్ధిమంతులైన కరండి గ్రామ జనులు ఒక గురుకులాన్ని అతని ఆధ్వర్యం క్రింద నెలకొల్పారు: వారి సదుద్దేశాన్ని పూర్తిగా ప్రోత్సహించాడు ఉజ్జయినీ నగర పాలకుడు 'నేమి' మహారాజు:

కృతుని యాజమాన్యంలో కరండి గురుకులం మంచి వృద్ధిలోనికి శీఘ్రకాలంలో వచ్చింది!

కాలం శరవేగంతో పయనించింది! ఆ కాలానికి తాళ హంగుని జతకూర్చి జగన్నాటక సూత్రధారియైన విధి- కృత ఋషివంటి తపోధనుని తన ప్రభావ జాలంలో ఇరికించింది!

నేమి రాజపుత్రి "వీరాదేవి" ప్రేమ కటాక్షాలనే జాలాన్ని కృతునిపై నేర్పుగా విసిరింది "విధి"!

మన్మథుని అరవ బాణమైన మోహనాంగి వీరాదేవి ప్రేమ కటాక్షాల్ని తిరస్కరించలేక పోయాడు కృతఋషి! నేమి మహారాజు వీరి ప్రేమని గుర్తించకపోలేదు! చిరకాలంనుండి ఆర్యఋషితో సంబంధం కలపాలని వాంఛిస్తున్న నేమి భూపాలుడు తన కుమార్తెయొక్క కోర్కెని నెరవేర్చుటకే తీర్మానించాడు.

వీరా కృతుల వివాహం జరిగిపోయింది!

వారిద్దరి ప్రణయ ఫలమే "కార్తవీర్యార్జునుడు"

* * *

విరోచనుడు కుండలీపురి వాస్తవ్యుడు!

పురి వాచకం గౌణంగా వర్తిస్తుంది. అది ఒక కుగ్రామం.

విరోచనుడు పంచమ జనుడు. ఆ కాలంలో ఆర్యులు అనార్యుల్లో కొందరిని పంచమ జను అని వర్ణించారు!

'విరోచనుడు' వృత్తిలో కమ్మరి. వాని భార్య పేరు "వజ్రి". వజ్రి విరోచనులు ఆదర్శ దంపతులు! వారికున్న పెద్దలోపం ఒకటే! సంతానం లేదు!

విరోచనుడు ఒకనాడు గండ్ర గొడ్డలిని తీసుకొని కర్రలకై అడవికి వెళ్ళాడు.

అప్పుడు మిట్టమధ్యాహ్నం. నభోమణి ఆకాశ మధ్యంలో తన చండ కిరణాల్ని వెద జిమ్ముతూ ప్రకాశిస్తున్నాడు! విరోచనుడు కర్రల్ని కొట్టి ఎండవేడికి అలసిపోయి పెద్ద మర్రి చెట్టుక్రింద మేను వాల్చి నిద్ర పోయాడు.

ఆ నిద్రలో ఏదో గిలిగింత పెట్టినట్లు అయింది! మెల్లగా కండ్లు తెరచి చూచాడు!

ఎదురుగా భయంకరమైన ఎలుగుబంటి నిలబడి ఉంది! వేటలో ప్రజ్ఞకల విరోచనుడు మొలలో బాకుసి పెరికి లాఘవంతో లేచాడు! ఎలుగుబంటి ఏమాత్రం చలించకుండా పండ్లి కిలించి గురగుర శబ్దం చేసింది! ఆ భీకర జంతువు సాధువుగా నిలబడి ఉండడంతో ఏదో అంతర్యం ఉందని గ్రహించాడు. విరోచనుడు!

ఎలుగురాయుడు తన గుండెలకి హత్తుకొని ఉన్న ఒక శిశువుని మెల్లగా క్రిందికి దించి, అక్కడ ఆగకుండా త్వరిత గమనంతో వెళ్లి పోయింది!

విరోచనుడు శిశువుకి దగ్గరగా వెళ్లిపోయాడు, కండ్లు ఆనందంతో తాండవించాయి!

ఆ శిశువు నింగి నుండి క్రిందపడిన చంద్ర బింబం లాగుంది! దాని తనూలత మిలమిలమని నక్షత్రంవలె మెరుస్తూంది! ఆ బిడ్డ తనకి ఈశ్వర వర ప్రసాదమని తలంచి విరోచనుడు పొంగిపోయాడు! కర్రల్నికూడ లెక్క చేయక శిశువుని తీసుకొనివెళ్లి భార్య చేతి కందించాడు!

ఆ దంపతులా శిశువునకు తల్లిదండ్రులై అల్లారు ముద్దుగా పెంచారు! శిశువునకు 'రేణుక' అని నామకరణం చేసారు!

* * *

రేణుకయందు పదిహేను వసంతాలు నవ యౌవనోన్మేష సౌరభ్యంతో వికసించాయి!

ఆమె యందు ముగ్ధ యొక్క లక్షణాలు, ప్రౌఢ యొక్క అంగసౌష్ఠవం కన్పించాయి!

రేణుక పసిడి బొమ్మ! ఆ నిగారింపు బంగారంలో లావణ్యవారి మెరుపు తీవ్వవలె ప్రకాశించింది! సుకుమారమైన ఆమె అంగాల్లో మంచి పాటవం కన్పిస్తుంది! ముక్కు, చిగురు పెదిమలు, పలువరస ఆ ముగ్ధ యొక్క వదన చంద్రునిలో ఎన్నతగిన సౌందర్య ఖండాలు! శ్రీకారాభశ్రోత్రములతో మంతనాలాడు ఆమె సోగకన్నుల మార్దవం, పక్ష్మలత్వం, తేజస్సు వర్ణనాతీతం! ఆమె తనూలత విద్యుల్లతవలె మహోజ్జ్వల కాంతికి ధామం!

రేణుక అందాల బరిణె! పల్లె జనులామెను దేవకన్య అని గౌరవిస్తారు! ఒకనాడు రేణుక తల్లి తీవ్రమైన మన్య జ్వరానికి గురి అయింది. ఆమె శరీరం కొలిమిలో లోహ ఖండంవలె మరిడిపోతూంది. విరోచనుడు లోహ వస్తువుల్ని సంతలో అమ్మకానికి తీసుకొని వెళ్ళాడు. తిరిగి ఇంటికి రావడానికి ఒకటి రెండు రోజులు పడుతుంది.

"అమృత వల్లి మూలిక తెలుసా? సెలయేరు ప్రక్కప్రాక్కి ఉంటుంది. ఒకమారు మీ నాన్నగారు తెచ్చారు కాదూ?" అని రేణుకని ప్రశ్నించింది, వజ్రి.

"అవునమ్మా! తెలుసు." బదులిచ్చింది, రేణుక.

"సూర్యోదయానికి ముందుగా సెల ఏరు ఒడ్డుకి వెళ్లి ఆ మూలికని తీసుకొని రా గలవా? ఈ పాడు జ్వరం వదలకుండా ఉంది."

"సరే నమ్మా!"

అరుణోదయం కావస్తోంది. రేణుక పడకపై నుండి లేచింది తల్లిని చూచింది. అప్పుడామె మగత నిద్రలో మైమరచి నిద్రిస్తూంది.

రేణుక గండ్ర గొడ్డలిని చేత ధరించి ఇల్లు విడిచి బైట పడింది. విస విస నడిచి సెల ఏటిని సమీపించింది. అదేమీ పెద్ద ఏరు కాదు. అక్కడక్కడ చిప్ప చిప్పలుగా నీరు కన్పిస్తూంది. ఏటి నిండా కంకర రాళ్లున్నాయి. కొన్ని పెద్ద రాళ్లకు పాకుడు పట్టి అరుణరాగంలో వింత శోభనిస్తున్నాయి!

రేణుక తీరాన్ని అంటి అడుగుల్లో అడుగు వేసుకొంటూ నడుస్తూంది. ఆమె అక్కడ ఒక్కొక్క తీవ్వని పరీక్షిస్తూంది.

అప్పుడే భూమి పొటాకింది. గ్రామంలో నుండి కుక్కుట ధ్వని విన వస్తూంది! అరుణ రాగంతో ప్రక్కలంట తెల్లని మబ్బు తునకలు కలిసినందున తూర్పు దిశ శోభాయమానంగా ఉంది! దూరం నుండి కోకిలరావం శ్రోత్రపేయంగా వినవస్తూంది! కొన్ని పక్షులు బారులు కట్టి చెదరిన మేఘ శకలాల్లాగు నింగిని కిలకిలా రావంతో పయనిస్తున్నాయి!

ఉన్నట్లుండి తూర్పు దిశ సింధూరకాంతిని వెదజిమ్మింది! రేణుకకి ఇంకా మూలిక దొరక లేదు. ఆమె మరికొంత దూరం ముందుకి సాగింది.

వెనుకనుండి గుర్రపు డెక్కల ధ్వని!

రేణుక సంభ్రమంతో వెనుదిరిగి చూచింది!

ఎత్తైన సల్లని ఉత్తమాశ్వంపై బంగారు కాంతిని చిమ్ముతున్న కవచాన్ని ధరించిన యోధుడు ఆమె కంటికి ప్రత్యక్షమయ్యాడు. అంత ఉన్నతమైన అశ్వాన్ని, అంత ఉన్నత కాయం కల పురుషుణ్ణి రేణుక చూచి ఉండలేదు అశ్వరాజం రేణుకను సమీపించింది!

"అమ్మాయీ! ఏం వెతుకుతున్నావ్? నీవు ఎవరి పిల్లవు?" అని యోధుడు ప్రశ్నించాడు. యోధుని కంఠధ్వని వర్షాకాల పయోధరంలో నుండి నిర్గమించే ఉరుములాగు వినపించింది!

యోధుడు స్ఫురద్రూపి! వాని ఆకర్ణాంత రక్తనయనాల విస్తృతి శృతినిమించి ఉన్నాయి! మీసకట్టు తేనెటీగల గుంపువలె వాని ముఖశోభకి వన్నె తెస్తూంది! చెవులకి వ్రేలాడు మణికుండలముల కాంతి సూర్యకిరణ భ్రాంతిని కలుగ చేస్తూంది! వాని ఉన్నతమైన నాసిక వాని హృదయగత రాజసాన్ని ఎత్తి చూపుతూంది!

(తరువాయి 21వ పేజీలో)

# ఛిన్నమస్త

(12 వ పేజీ తరువాయి)

వాడు బంగారు ఉష్ణీషణాన్ని ధరించి ఉన్నాడు! దానిపై పొదుగబడిన నవరత్నాలు వివిధ విధము లైన కాంతుల్ని చిమ్ముతున్నాయి!

అతడే చక్రవర్తి కార్తవీర్యార్జునుడు!

రేణుక వానికెట్టి బదులు ప్రసాదించలేదు. వాని వేషం ఆమెకు వింతగా ఉంది! ఆమె వాని ప్రశ్నకి బదులుగా చిన్న మందహాసం ప్రదర్శించింది!

ఆ మందహాసం కార్తవీర్యుని హృదయాకాశానికి వెన్నెలయింది!

"సుందరీ! నీ పేరేమి?" అని ప్రశ్నించాడు.

"నా...నా... పేరా?... వక్రవైరోచని!" అని బదులిచ్చింది తడబడుతూ!

"అబ్బో! పేరు చాల గంభీరంగా ఉందే!"

"నా పేరు మాట అటుంచు. నీ వేషం. అబ్బే- చాల వికృతంగా ఉంది!" అని ధైర్యంగా బదులిచ్చింది రేణుక!

"పిల్లా! నా గుర్రంపైన ఎక్కి నాతో వస్తావా? నీకు అనేక వింతలు చూపిస్తా."

"ఏం వింతలు?"

"అంతఃపురం, నందన వనాలు, రకరకాలైన పానీయాలు, వివిధవిధాలైన రత్నాలు చీనిచీనాంబరాలు - ఇత్యాదులు" అని నవ్వాడు చక్రవర్తి

"నీవు చెప్పిన వింతల అర్థం నాకు తెలీదు. కావాలంటే నేనొక వింతని నీకు చూపెట్టగలను."

"ఓహో! అలాగా! మరీ మంచిది. ఏం వింతో?

"నీవు అలాగే ఉండు. నీ శిరస్సుపైన ఉన్న ఆ వికారమైన బరువుని ఒక్క క్షణంలో ఈ గండ్రగొడ్డలితో క్రిందికి దొర్లిస్తాను" అని కిలకిల నవ్వింది.

ఎంతటి అవమానం! చక్రవర్తి భ్రూకుటిని ముడిపెట్టాడు. వాని కండ్లలో ఎరుపు కాంతి రెట్టించింది! వాని పెదిమలు వణికాయి! వాని విశాల వక్షం విప్పారింది!

"దుడుకు పిల్లా! నేనెవరో తెలియక జల్పిస్తున్నావ్! ఇదిగో ఇప్పుడే నిన్ను నా గుర్రంపై ఎక్కించుకొని వెళ్తాను. నన్ను ఎలాగు ప్రతిఘటిస్తావో చూస్తాగా!" అన్నాడు క్రోధంతో.

వాని గుర్రం సకిలించింది! అది ముందరి కాళ్ళని మీదికెత్తింది! అంతే! కనురెప్పపాటులో గండ్రగొడ్డలి రివ్వుమని దూసుకొని వెళ్ళింది! దాని పోటు ఎట్టిదో రేణుక చూడలేదు! ఆమె పరుగు తీసింది! ఎంతవేగం! లేడిలా పరుగెత్తింది రేణుక! నదిని ఒక్క అంగలో దాటింది! వెనక గుర్రం చప్పుడుకూడ ఆమెకి వినిపించలేదు. ఆమెలో ఏదో వింతశక్తి ప్రవేశించింది కాబోలు! ఆమె గాలిలో పయనిస్తున్నట్లు భావించింది!

రేణుక మెదడు శూన్యమైపోయింది! కండ్లు చీకట్లు క్రమ్ముకొన్నాయి! చైతన్యం తప్పి వెల్లకిలా ఒక మర్రిచెట్టు బోదెపై పడిపోయింది. ఆమె బాహువులు వెనక నుండి లతలాగు మర్రిచెట్టునే కాబోలు కౌగలించుకొన్నాయి!

అంతర్లీనుడై సమాధియోగంలో ఉన్న మహర్షి జమదగ్ని ఉలిక్కిపడి కండ్లు తెరచాడు!

అతని కంటికి ఎదురుగా నేలపై కన్పడింది మిల మిల బాల సూర్య కిరణాల్లో మెరుస్తున్న గండ్రగొడ్డలి! ఒక యోధుడు నల్లని గుర్రంపై వంద గజాలదూరంలో దౌడు తీస్తున్నాడు! తరువాత తన తొడలపై ఒక యువతిని చూచాడు ఋషి పుంగవుడు!

విస్తృత వినీల కచభరంయొక్క మధ్య చందమామవలె ఆ యువతి ముఖం మహర్షిని ఆకర్షించింది! ఉరోజాలపైనున్న వస్త్రం సడలి నడుమ బంగారు తామర మొగ్గలవలె ఆమె ఉరోజ చక్రవాక మిథునం మహర్షి కండ్లకి విందు కావించింది! నడుముని చుట్టి ఉన్న ఆమె బాహులత కేతకీదళాల సునువుతో మహర్షి శరీరానికి మధురమైన స్పర్శానుభూతిని కల్గించింది!

మహర్షి రేణుక ముఖాన్ని చూచాడు! చూడ తగ్గదాన్ని చూచినట్లు తృప్తిని పొందింది మహర్షి యొక్క కల్లోల హృదయం:

"ప్రభో! మఘవన్! హిమాలయంలో భవద్ధ్యాన తత్పరుడనై ఉండిన నన్ను ప్రేరేపించి ఇందులకేనా ఇక్కడికి తరిమావ్! భగవన్! నీ లీల మానవ మాత్రుడైన నాకు ఎట్లు తెలుస్తుంది! ఈ చక్కని చుక్క, ఈ మెరిసిపోతున్న చంద్రబింబం నా తొడలపై పడిపోనేల? పడినేపో, నేను ఆమెను చూచి చలింప నేల? ముప్పది సంవత్సరాలుగా పాలిస్తున్న నా బ్రహ్మచర్య నిష్ఠకి భంగం కలిగిపోయింది! ఇట్టి సందర్భాన్ని సృష్టించి భక్తుని శోధిస్తున్నావా? వజ్రబాహూ! ఇంతదూరం విషయాన్ని పెంపు చేసిన నీవే నాకు కర్తవ్యాన్ని ఉపదేశించు!" అని కొంత తడవు కండ్లు మూసుకొని జమదగ్ని హృదయంలోనే ధ్వనించాడు!

జమదగ్ని ముప్పదేండ్ల ప్రౌఢ యువకుడు! కఠినమైన బ్రహ్మచర్య దీక్షను వహించి నిరంతర తపస్సుచే సాధించిన అమృతత్వ సిద్ధికల మహాయోగి!

అతని అజాను లంబితబాహువులు, విశాలమైన వక్షమ్ము, విశాలమై తేజోపూరితాలైన నయనాలు చూచినప్పుడు అతనియందు బ్రహ్మకళతోపాటు మహావీరుని లేజుకూడ పొదకట్టక మానదు! తపోవ్యసనియైన అతని కేశాలు సంస్కార హీనములై పింగళరాగంతో జటలు కట్టిఉన్నాయి చిన్నగడ్డం బలసి అతని సుందరవదనానికి వింత శోభ నిస్తుంది!

జమదగ్ని కమండలూదకాన్ని బాలిక మోముపైన జల్లి, తన చేలాంచలంచే విసిరాడు!

రేణుక కండ్లను విప్పింది! ఆమెకి మహర్షి యొక్క ముఖమండలం గోచరించింది! అమనక తెలివిలో ఆమె మహర్షి ముఖాన్ని భానుబింబమని తలంచింది!

"ప్రభో! ప్రభాకరా! నీకిదే వందనాలు!" అని గొణిగింది.

"అమ్మాయీ! నీకేమీ భయంలేదు. లే!" అన్నాడు ఆప్యాయంగా జమదగ్ని!

రేణుక సిగ్గు పడింది! పైట సరిచేసుకొంది! లేచింది. తన కెదురుగాఉన్న మహర్షిని చూచి చేతులు జోడించి ఇలాగంది.

"మహాత్మా! నా అపరాధాన్ని క్షమించండి! నేను ఆవేశంతో ఒక దుష్టుని బారినుండి తప్పించుకోడానికి పరుగెత్తాను...!"

"సుందరీ! నా కంతా తెలిసింది! నీవేమీ భయపడవద్దు. ఆ దుష్టుడు ఇప్పుడు లేడు. వీడు నీ ప్రణయాన్ని ఆశిస్తున్న ఒక పేద తపస్వి!"

రేణుకయొక్క శరీరం నునుదొంగర్ల సిగ్గు పువ్వులతో వికసించింది!

ఆమెకి మహర్షియొక్క భావం ఒక విధంగా అర్థమయింది!

"మహాత్మా! ధన్యురాల్ని!" అని పండ్ల సందులోంచి సన్నగా పలికింది!

"సుందరీ! అదిగో నీదే కాబోలు గండ్రగొడ్డలి. తీసుకో. నేను స్వయంగా వచ్చి నీ ఇంట్లో దిగపెడ్తాను." అని మహర్షి లేచాడు.

రేణుక గండ్రగొడ్డలిని తీసుకొని మహర్షి వెనువెంట బయలుదేరింది! బాలభానుడు తన సహస్ర రశ్ములతో ఆ జంటని ఆశీర్వదిస్తున్నాడా

అన్నట్లు తూర్పు దిక్కున బారెడు ఎత్తున జ్వలించాడు!

* * *

మన కథా కాలం చాలా పురోగమించింది! ఉజ్జయినిలో అర్జున భూపాలుడు మధ్యందిన మార్తాండుని వంగి వెల్లుతున్నాడు! అతని భుజదండముల మధ్య దక్షిణాపథమంతా ఇమిడిపోయింది! అరితేరిన ఐదువందల అతిరథ శ్రేష్ఠులు చూపగలిగే పరాక్రమాన్ని అతడొక్కడే ప్రదర్శించ గలిగినందున, కార్తవీర్యుడు సహస్ర బాహుడని కీర్తింపబడ్డాడు! అతడు సహస్ర బాహుడే కాదు సహస్రాక్షుడు కూడ! రాజ్యంలోని నేరస్థులు అతని చార చక్షువుల్ని దాటి వెళ్ళలేకపోయారు! కాబట్టి అతని రాజ్యంలో శాంతి భద్రతలు కాపురం చేసాయి!

పౌలస్త్యకుల చంద్రుడు, మహోగ్ర పరాక్రముడు, రావణాసురుడంతటివాడు దక్షిణా పథంలో అడుగు పెట్టలేక పోవుటకు కారణం కార్తవీర్యుని పరాక్రమమే!

అదే సమయంలో సహ్యాద్రి ప్రాంతంలో చంద్రగిరి పర్వత సానువులందు మహర్షి జమదగ్ని తన సతీమణి రేణుకాదేవితో కలిసి గురుకులాన్ని స్థాపించాడు! దాన్ని దృఢ మూలంచేసి జమదగ్ని వేలాది శిష్యగణంతో స్థావరం ఏర్పరుచుకొన్నాడు! ఆ ప్రాంతాలకి శాశ్వతంగా నీటి కొరతని తీర్చే నిమిత్తం తన కమండల ధారని ప్రవహింపచేసి ఇంతకు ముందుండిన నిర్జీవమైన సెలయేటిని సజీవ నదిగా చేసాడు జమదగ్ని మహర్షి.

చక్రవర్తి కార్తవీర్యార్జునుడున్నూ, మహర్షిన్నీ సమవయస్కులు. సమాన రూప తేజో సంపదకలవారు! ఒకడు క్షత్రియోచిత క్రియలందు అపార శక్తి కలవాడు, మరొకడు ఆత్మశక్తి పూరిత బ్రహ్మతేజో ప్రభావ సంపన్నుడు! ఆ ఇద్దరికి ఆ ఇద్దరేసాటి!

జమదగ్ని పత్ని రేణుకాదేవి ఇప్పుడు పుత్రవతి! ఆమె వయస్సులో ముప్పై అయిదు శరత్తులు దొర్లిపోయాయి! ఆ వయస్సులోనూ, ఆమె శరీరం సౌందర్య ప్రదర్శనా శాలవలె నయన పర్వంగానే ఉంది!

రేణుకాదేవికి అధ్యాత్మ గురువు మహర్షి జమదగ్నే! భర్త వద్ద పారమార్థిక విద్యతోపాటు లౌకిక జ్ఞాన సంపత్తిని కూడ ఆమె ఆకళించుకొని విద్వాంసురాలయింది!

రేణుకాదేవి తన నాధునియందే పరమేశ్వర స్వరూపాన్ని చిత్రించుకుని జగత్కారణ కర్తయైన ఇంద్రునికి సగుణత్వాన్ని ప్రతిపాదించిన పరమ పతివ్రత! ఆమె సర్వకాల సర్వావస్థల్లోను తన పతిదేవుని తన స్వరూపంగానే ధ్యానించే పరమయోగిని!

అటు తపోమూర్తియైన జనకుని ఇటు కుండలినీ శక్తి రూపిణియైన తల్లిని పుడికి పుచ్చుకొని పుట్టుకతోనే బాలయోగిగా ఉద్భవించాడు భగవాన్ రాముడు! తల్లి వానికి తనకి అతిప్రియమైన పరశువుని ఇచ్చి వానిని పరశు రామునిగా చేసింది!

కౌమార దశలోనే - ఇంకా చెక్కిళ్ళలో తల్లిపాలు తొణికిసలాడు తుండగనే - పరశురాముడు తల్లిదండ్రుల అనుమతిని పొంది హిమాలయములకు వెళ్ళి, ఘోరమైన తపస్సుచేసి, సకల దురితాపహారియైన శంకరుని మెప్పించి అమృత సిద్ధిని పొంది తండ్రిని మించిన కుమారుడయ్యాడు!

అప్పుడు పరశురాముని వయస్సు పద్దెనిమిదేండ్లు!

* * *

అది శరత్కాలం! నదీ జలాలయందు శీతలత్వం, తరులతా గుల్మాదులందు శుష్కత్వం సర్వ జీవరాసుల్లోను తద్రిత, ఆకాశమందు మంచు మబ్బులు, సూర్యబింబంలో విరాగ లక్షణం, చంద్రబింబంలో ప్రత్యేకమైన దాశధళ్యం కలిగి ప్రకృతి చైతన్యా చైతన్యాల మధ్య ఊగులాడుతూంది!

అదే కాబోలు జ్యేష్ఠాదేవియొక్క కళావికాసానికి ఉదాహరణ! జమదగ్న్యాశ్రమం కళా విహీనంగా ఉంది! ఉషః కాలంలో చెలరేగే హోమధూమం వెలువడ లేదు! ప్రాతః సంధ్యాకాల ఉపస్థాన మంత్రాల ఘోషణ వినబడ లేదు!

ఒక యువకుడు ఆశ్రమాభిముఖుడై ఉషః కాల సమయంలో నడుస్తున్నాడు! వాడు ఆజాను లంబిత బాహుడు! ఆకర్ణాంత విశాల నయనుడు! శుద్ధస్ఫటిక సన్నిభ శరీరుడు! వాని విశాల వక్షస్థలం త్రిభువనాల్ని సవాలు చేయగలిగి వజ్రదృఢమై ఒప్పుతూంది! నల్లని గిరజాలు, నూనూగు మీసకట్టు కలిగి వాని ముఖం శరత్కాల చంద్రుణ్ణి ధిక్కరిస్తూంది! వాని భుజంపై గండ్రగొడ్డలి వ్రేలాడుతూంది! వాని పద ఘట్టనలచే భూమి అదురుతూంది!

అతడే భగవాన్ పరశురాముడు!

నిర్జీవ కళలతో దీనంగా ఉన్న ఆశ్రమాన్ని ఆశ్చర్యంతో చూస్తూ పరశుధారి ఆశ్రమాన్ని చేరుకొన్నాడు! తిన్నగా తన తండ్రియొక్క పట కుటీరంలో అడుగుపెట్టాడు!

అవనత శిరస్కుడై కూర్చొని ఉన్న తండ్రిని చూచి పరశురాముని హృదయం తల్లడిల్లింది!

"నాన్నగారూ! నేను మీరాముణ్ణి!" అన్నాడు బిగ్గరగా.

జమదగ్ని దిగ్గని లేచాడు!

"నా తండ్రీ! వచ్చావా?" అని కుమారుని కౌగలించుకొన్నాడు! అతని వేడి కన్నీటి ధార పరశురాముని భుజస్కంధాన్ని తడిపింది!

జమదగ్ని కుమారుని కూర్చోబెట్టి ఇలాగన్నాడు.

"నాయనా! నీ తల్లిని - పరమ పతివ్రతని కార్తవీర్యార్జునుడు నది నుండి నీరు తెస్తుండగా దొంగలించుకొని పారిపోయాడు! ఈ ఘోర కార్యం జరిగి మూడు మాసాలయింది! నేను కర్తవ్యాన్ని నిర్ణయించుకో లేకపోతూ, ఈ కాలాన్ని చాల బరువుగా గడిపాను. నీవు వచ్చావ్! ఇక నీ తల్లియొక్క విషయంలో ఏమి చేయాలో నీవే నిర్ణయించు!"

పరశురాముని కండ్లనుండి కన్నీరు కారలేదు! నిప్పు కణాలు రాలాయి! వాని ముఖం ఎర్రని సహస్రదళ తామరసంవలె ఎరుపెక్కింది భ్రూకుటి ముడివడి రుద్రుని ఫాలాక్షుని పోలింది! పెదిమలు వణికాయి! భుజస్కంధములు ఉబికాయి! వాని వక్షస్థలం పర్వత సానువువలె పొంగింది! పరశుధారి తన తల్లి తనకిచ్చిన గండ్రగొడ్డలిని చేతిలో పట్టుకొని మూడుసార్లు చుంబించి ఇలాగన్నాడు!

"తండ్రీ! పరమ పూజ్యములైన మీ పాదాల్ని ముట్టి ప్రమాణం చేస్తున్నాను! ఇదిగో ఇప్పుడే వెళ్ళి నా తల్లిని చెరనుండి విడిపించుకొని వస్తాను. ఆ దుర్మార్గుణ్ణి ఈ పరశువుతో ఖండ ఖండములుగా ఖండిస్తాను! ధన మదాంధతచే క్రొవ్విన దక్షిణ ఉత్తరాపథముల రాజన్యలోకాన్ని నా గండ్ర గొడ్డలికి బలి ఇస్తాను! భూమాతయొక్క పవిత్ర శరీరాన్ని వారి రక్త ధారల్తో తడిపి రాజసగుణానికి స్వస్తి చెప్పిస్తాను! భగవాన్ ఇంద్రుని వజ్రధారవలె నా మాతృదత్తమైన పరశువు యుద్ధరంగంలో ప్రకాశించుగాక! మాతృ విముక్తి చేయనిదే మంచినీళ్ళకూడ ముట్టను. అజ్ఞ దయచేయండి!" అని గర్జించాడు అమేయ ప్రతాపుడు పరశురాముడు!

"బిడ్డా! పరశూ! జామదగ్న్యుల కీర్తిని ప్రతిష్ఠించు! అకార్త వీర్యమస్తు! కాని తండ్రీ! ఒక్క మాట! నీ తల్లి పరగృహావాసంవల్ల కళంకితురాలై పోయింది! అది దైవ నిర్ణయం కాబోలు! కాబట్టి ఆ పవిత్రమూర్తిని చెర విడిపించి యదే

(తరువాయి 27వ పేజీలో)

# ఛిన్నమస్త

(22 వ పేజీ తరువాయి)

చ్ఛగా విడిచి పుచ్చు! ఆమెకి ఈ ఆశ్రమంలో జాగాలేదు. ఇదే నా నిర్ణయం! నీకు వజ్రధారి అపార శక్తిని ప్రసాదించుగాక!" అని చెప్పాడు జమదగ్ని!

* * *

కార్తవీర్య పరశురాముల యుద్ధం జరిగింది!

ఆ యుద్ధాన్ని దేవగణమే వర్ణించలేనప్పుడు అల్పమేధస్సు కల నేను ఎట్లు వర్ణించగలను!

నభస్సునుండి జారి పడిపోయిన భాను బింబంలాగు కార్తావీర్యుని శిరస్సు పరశురాముని పరశుధారకి నేలకి ఒరిగిపోయింది!

కార్తవీర్యుని సామ్రాజ్యమంతటిని పరశురాముని వశం కావించారు, మంత్రి దండనాధులు! ఆ సామ్రాజ్యాన్ని ప్రజల పరం కావించి పరశురాముడు నాలుగు గుర్రాల రథంపైన తన తల్లి రేణుకాదేవిని కూర్చుండజేసి జమదగ్ని యొక్క ఆశ్రమాభిముఖుడయ్యాడు. ఆశ్రమ సమీపంలో రథాన్ని ఆపుచేసి, తండ్రియొక్క కఠిన నిర్ణయాన్ని మాతృదేవికి వినిపించాడు!

"రామా! ఈ రోజు నాజీవితంలో ధన్యమైంది! నీ తండ్రిగారి తీర్మానం నా కెంతో ఆనందాన్ని చేకూర్చింది. పవిత్రతకి, శీలానికి ఉదాహరణ భూతమైన ఆర్యస్త్రీ కులానికి నా జోహారు! అట్టి నారీలోక కీర్తికి నీ తల్లి రేణుక కళంకం తీసుకొని రానేరదు. విధి నిర్ణయమే తేజో బ్రహ్మ రూపుడైన నీ తండ్రి ముఖంద్వారా ఇట్టి నిర్ణయాన్ని చేసిందని నా విశ్వాసం! నీవు పిత్రాజ్ఞని పాలించినట్లే మాత్రాజ్ఞని పాలిస్తావని నమ్ముతున్నాను!" అని చెప్పింది మాతృదేవి!

"అమ్మా! నీవు కాలితో ఆదేశిస్తే దాన్ని నేను శిరస్సుతో ఆచరిస్తాను! ఆజ్ఞని దయ చేయమ్మా!

"అయితే విను. నీ తండ్రియొక్క ముఖారవిందాన్ని నేను చూడాలి. ఆ అవకాశాన్ని కల్గించు. నేను ఆశ్రమంలో అడుగు పెట్టను. నీ తండ్రిని నేను చూచిన తర్వాత నీవు నీ పరశువుతో నా శిరస్సుని ఖండించు! ఇదే నా ఆజ్ఞ!"

పరశురాముడు కొన్ని నిమిషాలు స్తంభించిపోయాడు! వాని కండ్ల వెంబడి మొట్టమొదటిసారిగా కన్నీరు స్రవించింది!

"అమ్మా!... అమ్మా!" అని కేక వేసాడు ఏడుస్తూ!

"నాయనా! రామా!" అని తల్లి కుమారుని కౌగలించుకొంది. ఆ కౌగిలిలో విచిత్రమైన అనుభూతి కలిగింది జగదేక వీరునికి! ఏదో శక్తి వాని రక్తనాళాల్లో ప్రవహించింది! ఆవేశంలో ఇలాగన్నాడు. "అమ్మా! నీ ఆజ్ఞని పాలిస్తాను! నా తల్లికి దివ్యత్వాన్ని కల్పించి మాతృఋణాన్ని తీర్చుకొంటాను.

* * *

జమదగ్ని మహర్షి తన శిష్యగణంతో రేణుకాదేవి దర్శనం నిమిత్తం వచ్చాడు!

ఆదివ్య సందర్శనం అతిలోకమాన్యమయింది!

రేణుకాదేవి శరీరం దివ్యతేజోపూరితమై ప్రకాశించింది.

"రామా! నా పతి దేవుని చూచాను! ఇక నీ కర్తవ్యాన్ని నెరవేర్చు!" అని ఆదేశించింది మాత!

చెప్పినదే తడవు! పరశుధారి భీకర పరశువు విద్యుద్ఘాతంవలె రేణుకాదేవి కంఠసీమని వరించింది! ఆశ్చర్యం! ఆ శిరస్సు నేలపడలేదు! అది రేణుకాదేవియొక్క దక్షిణ హస్తతలంలో పడింది! అది బ్రహ్మాండమైన నక్షత్రంవలె ప్రకాశించింది!"

"శర్మా! విన్నావా పరమ పావని "ఛిన్నమస్త" చరిత్రన్ని! ఇచ్చట - కథని ముగింపు చేస్తూ - మహాకవి గణపతి మునిచే ఛందోబద్ధమైన వాక్కుల్ని స్మరించి పునీతుల మౌదాం!

"ఛిన్నం శిరః కీర్ణకచం దధానాం, కరేణ కంఠోద్గత రక్తధారాః ధారాత్రయే తత్రచ మధ్యధారాం, కరస్థ వక్త్రేణ ముదాపిబంతీం॥ ఇట్టి రూపంతో ఛిన్నమస్తని ధ్యానించి ధన్యుల మౌదాం!

"భగవతి! కృత్తశిరా భవతి
మదితవతీ నృపతీ నఖిలాన్ ॥
ప్రథన భువి ప్రగుణం భుజయోః
పరశు ధరాయ వితీర్య బలం॥

శర్మా! అదిగో దేవాలయంలో ఘంటానాదం వినిపిస్తూంది! మనం వెళ్లి ఛిన్నమస్తని దర్శనం చేసి తరిద్దాం!

—:o:—

★

కవిత:

# తియ్యని రేపు

ఎంతో తియ్యని రేపు
వింత గొలుపు ఆశ చూపు
* * *
ఆశయాలు నెమరువేసి
ఆదర్శము తిరగవేసి
కొత్తనైన ఉత్సాహము
హత్తుకొనగ నిదురలేచి
పక్కనుంచి దిగినంతనె
ఒక్కటొకటిగా మెలుగును
లెక్కకు మీరిన ఊహలు
వంటంతా చూసుకొని
యింటిని సరిచేసుకొని
ఇస్త్రీ మడతలు నలిగిన
వస్త్రాలను వేసుకొని
బ్రతుకుతెరువు నిమిత్తమై
సతతము పోటీ పడుచును
భత్యపు గింజల కొరకై
నిత్య జీవిత యాతనలు
లోకముతో సుళ్లు తిరిగి
చీకటితో యిల్లుచేరి
ఆశయాలు ఆకళించి
ఆదర్శము మేళవించి
తియ్యని రేపటి కొరకై
వెయ్యి కళ్ళతో వేచుట
* * *
ఎంతో తియ్యని రేపు
వింత గొలుపు ఆశ చూపు

"జగత్ నాథ్"

★